



# కరపత్రం

SINCE 2014

మంగళవారం జూన్ 30, 2026 | సంపుటి : 2 | సంచిక : 258 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## రైతు ఆశీర్వాద సభ వాయిదా

### రైతు భరోసా పంపిణీ తరువాత రైతు ఆశీర్వాద సభ


- వరుణుడు కూడా కరుణించడం ఆనందదాయకం
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

**ఖమ్మం,జూన్29 :** ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుడు కూడా కరుణించడాని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భారీ వర్షాల కారణంగా ఈ నెల 30న తలపెట్టిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల సభా ప్రాంగణం అంతా బురదమయంగా మారిందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ కారణం వల్ల రైతులకి ప్రజలకి కాంగ్రెస్ కార్యకర్తలకి ఎవరికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతోనే సభ నిర్వహణలో మార్పులు చేసినట్లు ఆయన చెప్పుకుచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో తలపెట్టిన రైతు ఆశీర్వాద సభ ప్రాంతాన్ని సోమవారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి పరిశీలన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్షలాది మంది రైతుల సమక్షంలో ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులందరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించాలని భావించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో ఇక్కడ సభ నిర్వహించడం అందరికీ ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. తొలిరోజు ప్రారంభ సభగా అనుకున్న ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తి అయిన తర్వాత మరింత ఉత్సాహంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వర్షాలు తగ్గిన తరువాత వాతావరణ శాఖ నివేదికలను అనుసరించి ముఖ్యమంత్రి, కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు. సభ నిర్వహణ తేదీలపై ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే వాతావరణ శాఖ నుంచి వారం రోజుల ముందస్తు అంచనాలను తీసుకుంటుందని ఆయన అన్నారు. జులై నెల 3, 4 తేదీల వరకు వర్షాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు మరో వారం రోజుల వాతావరణ సమాచారాన్ని సేకరించాలని ఆదేశించాం. వాతావరణ పరిస్థితిని బట్టి ఈ సభను వచ్చే 6, 7 లేదా 8వ తేదీల్లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సత్తెపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయిలతో పాటు జిల్లాలోని శాసనసభ్యులంతా సమన్వయంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న మిగతా ఎమ్మెల్యేలు, ప్రజలు, రైతాంగ సోదరులు ఈ సభకు తరలిరావడానికి భారీ ఉత్సాహాన్ని చూపిస్తున్నారని, ప్రజలు ఊహించని రీతిలో ఈ సభ అత్యంత విజయవంతం కాబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం

- ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేందకరన మోడీ





**విక్టోరియా,జూన్29 :** భారత్-సీషెల్స్ మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సీషెల్స్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం భారత ఆర్మీ, నౌకాదళ దళాలు కవాతు నిర్వహించగా.. వారికి గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబడటం కార్యక్రమానికి విశేషంగా నిలిచింది. రాజధాని విక్టోరియాలో నిర్వహించిన గో÷-డలెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత నౌకాదళానికి చెందిన సిబ్బంది కవాతు నిర్వహించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా అస్సాం రెజిమెంట్ జవాన్లు తమ ప్రసిద్ధ రెజిమెంటల్ గీతం 'బద్లు రామ్ కా బదన్' ఆలపిస్తూ మార్చ్ చేయడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కష్, స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఐఎన్ఎస్ ఇక్షాక్ సర్వే నౌకలూ పాల్గొన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతున్న సంకేతాలు స్పష్టం అయ్యాయి. ఈ సందర్భంగా భారత నౌకాదళం స్పందించింది. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాల్లో ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలు, భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటింజెంట్ పాల్గొన్నాయని తెలిపింది.

## 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

- ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**హైదరాబాద్,జూన్29 :** తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుకు సంబంధించి ఒక ప్రతిష్టాత్మక ప్రణాళికను ప్రకటించారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్‌కు, భారత స్వాతంత్ర్య శతవార్షికోత్సవం జరిగే 2047 నాటికి 3 ట్రిలియన్‌కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల ఒక జాతీయ ఆంగ్ల పత్రిక వీడియో ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తెలంగాణ ప్రస్తుతం దేశ జీడీపీలో దాదాపు 5శాతం వాటాను అందిస్తోందని, 2047 నాటికి ఈ వాటాను 10?కి రెట్టింపు చేయాలని భావిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ లక్ష్య సాధనకు పాలన, పరిశ్రమలు, అట్టడుగు స్థాయి ఆర్థిక కార్యకలాపాలలో నూతన సాంకేతికతలను ప్రవేశపెట్టడం కీలకమని ఆయన పేర్కొన్నారు ? ఇందులో రాష్ట్రంలోని 65 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలు కూడా భాగమని, వీరికి ఈ ఏడాదే రూ. 21,000 కోట్ల రుణాలు అందించామని, ఎన్‌పీఏలు దాదాపు సున్నా స్థాయిలో ఉన్నాయని తెలిపారు. పెట్టుబడిదారుల విశ్వాసానికి రెండు ప్రధాన అంశాలు కారణమని శ్రీధర్ బాబు అన్నారు. రాజకీయ పార్టీలు మారినా కొనసాగుతున్న విధాన స్థిరత్వం, సులభతర వాణిజ్య నిర్వాహణ పెట్టుబడిదారులకు భరోసానిస్తున్నాయని చెప్పారు.

## కొడంగల్‌లో 33వేల డూప్లికేట్ ఓట్లు

» రేవంత్ గెలిచింది ఆ ఓట్లతోనే

» టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు



**హైదరాబాద్,జూన్ 29 :** దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ జరిగిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని.. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని.. వీటిని తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందని ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో కేవలం 800 ఓట్లు మాత్రమే తొలగించారని కవిత అన్నారు. కొండగల్‌లో తాము వెరిఫై చేస్తే 33వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని చెప్పుకొచ్చారు. మిగతాద్ది 2 లో

## హరీష్ రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది




- ప్రజలు ఐదేళ్లకు తీర్పునిచ్చారు- ఎందుకు అసెంబ్లీని రద్దు చేయాలి
- ప్రతి ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు శిక్ష వేస్తూనే ఉన్నారు
- బిజేపీది ఆశకాదు.. అత్యాశ
- రైతు భరోసా నిధులు వారంరోజుల్లో జమచేస్తాం
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,జూన్29 :** బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరుచూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలన్న హరీష్ రావు వ్యాఖ్యలపై పై విధంగా స్పందించారు.

## నగరంలో స్థానిక ఎన్నికలకు సిద్దం కావాలి

» వచ్చే అసెంబ్లీకి ఇప్పటి నుంచే కసరత్తు

» పార్టీ శ్రేణులకు కిషన్ రెడ్డి పిలుపు



**హైదరాబాద్,జూన్29 :** మనమందరం ఇప్పటి నుంచే ఎన్నికలకు సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. రానున్న మూడు కార్పొరేషన్ ఎన్నికలతో పాటు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఈ రోజు నుంచే క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధ్యమని కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు.




## జీవితం అంటే వందమీటర్ల పరుగుపందెం కాదు

- ఓపిక, నిలకడ శక్తితో చేపట్టిన పనులు పూర్తి చేయాలి
- వీబీఐటీలో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో నితిన్ నబీ
- వర్చువల్‌గా పలు జిల్లాల కార్యాలయాలు ప్రారంభం
- తెలంగాణలో బిజెపి అధికారానికి ఎంతో దూరం లేదని వ్యాఖ్య

**హైదరాబాద్,జూన్29 :** జీవితం వంద మీటర్ల పరుగుపందెం కాదని.. మన ఓపికకు పరీక్ష అని భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ వీబీఐటీ క్యాంపస్‌లో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. భాజపా యువ మోర్చా ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. రాజకీయాల్లో ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. చిన్న వయసులోనే అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చాను. రాజకీయాల్లోకి వచ్చాక నా భవిష్యత్తుపై గందరగోళంలో పడ్డాను. ఏ పని చేసినా నాదైన ముద్ర ఉండాలని గట్టిగా అనుకున్నాను. అప్పగించిన పనిని నిబద్ధతతో పూర్తి చేయడమే నా బలం. వేగంగా లక్ష్యాలు చేరాలనే ఆరాటంలో నేటి యువత ఉంది. ఏ పనినైనా ఓపిక, నిలకడ, శక్తితో చేసినప్పుడే ఫలితాలు వస్తాయని అన్నారు.

## కేంద్రం సహకరిస్తేనే రాష్ట్రాలు అభివృద్ధి సాధ్యం

» వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలున్నాయ్

» పాత విధానంలోనే 75 శాతం కాంపోనెంటట్ కొనసాగించాలి

» 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు

» గ్రామీణాభివృద్ధిశాఖ సమావేశంలో సీతకక్క స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,జూన్29 :** కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పథకాలకు సంబంధించి తీసుకువస్తున్న సరికొత్త నిధుల విధానాలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.




## తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక సహకారం

- అక్టోబర్ 25న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం
- ఇరు సంస్కృతుల వైభవాన్ని ప్రతిబింబించే ప్రత్యేక వేదికగా హైదరాబాద్
- భారత్‌లో కే-డ్రామాల ఆదరణతో సాంస్కృతిక అనుబంధం మరింత బలోపేతం
- కళా-సాంస్కృతిక భాగస్వామ్యానికి ప్రాధాన్యం: మంత్రి జూపల్లి

ఈ ఏడాది అక్టోబర్ 25న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం నిర్వహించాలని తెలంగాణ - కొరియన్ కల్చరల్ సెంటర్ లు సంయుక్తంగా సూత్రప్రాయ అంగీకారానికి వచ్చాయి. తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరు పక్షాలు చర్చించాయి.



కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం జూన్ 30, 2026

# జీవితం అంటే వందమీటర్ల పరుగుపందెం కాదు

మొదటిపేజీ తరువాయి

ఇదిలావుంటే రంగారెడ్డి జిల్లా రూరల్ భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయాన్ని నితిన్ నబీన్ ఘనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు వర్చువల్ విధానం ద్వారా మరో 9 జిల్లాల పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడుతూ.. నాటి నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కల్పించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు, అలాగే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. పార్లమెంట్‌లో నాడే తెలంగాణ వాణిని బలంగా వినిపించిన దివంగత నేత సుష్మా స్వరాజ్ సేవలను కూడా ఆయన ఈ సందర్భంగా స్మరించుకున్నారు. గతంలో దేశవ్యాప్తంగా బీజేపీ కేవలం రెండు లోక్‌సభ స్థానాలు గెలిచినప్పుడు.. అందులో ఒకటి తెలంగాణ నుంచేనని నితిన్ నబీన్ గుర్తుచేశారు. ఈ స్థాయికి చేరడానికి ఎంతో మంది పార్టీ కార్యకర్తలు తమ ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. తెలంగాణకు లీడర్లు ఎంతో దూరం లేరని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి మూలలోనూ కమలం వికసించి, భగవాధ్వజం ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై బీజేపీ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తారని, ప్రజావ్యతిరేక పద్ధతులను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నో ఆటంకాలు ఎదురైనా తీవ్రంగా సంఘర్షణ చేసి ఎలాగైతే విజయం సాధించామో, తెలంగాణలోనూ అదే పునరావృతం అవుతుందన్నారు. బెంగాల్‌లో పార్టీని గెలిపించిన సునీల్ బన్సల్ ఇక్కడే ఉన్నారని, తెలంగాణలో కూడా అంతకన్నా ఎక్కువ కష్టపడి పార్టీని గెలిపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్షిస్తున్న 'వికసిత భారత్' లక్ష్యం సంపూర్ణంగా నెరవేరాలి అంటే తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నితిన్ నబీన్ స్పష్టం చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో ఉండే 'డబుల్ ఇంజన్ సర్కార్' వస్తేనే తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల అసలైన కలలు సాకారం కావాలన్నా, ఒక వికసిత తెలంగాణ నిర్మాణం జరగాలన్నా ప్రజలంతా బీజేపీతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరగబోయే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించబోతోందని ఆయన జోస్యం చెప్పారు. కాగా, సాయంత్రం వేళ నితిన్ నబీన్ పార్టీకి చెందిన బీఎల్‌ఓలు, బూత్ కమిటీ అధ్యక్షులు , ముఖ్య కార్యకర్తలతో సమావేశమై రాబోయే ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశర చేశారు.

# నగరంలో స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

మొదటిపేజీ తరువాయి

రానున్న ట్రై-కార్పొరేషన్ ఎన్నికల్లో మూడింటికి మూడు స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజల్లో తిరగాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి బాధ్యతగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశర చేశారు. హైదరాబాద్ నగరం ప్రస్తుతం మజ్లిస్ పార్టీ కబంధ హస్తాల్లో చిక్కుకుందని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో ఏ అధికారులు ఉండాలో, ఎవరు ఎక్కడ పని చేయాలో సెక్రటేరియట్ నుండి కాకుండా దారుసలాం నుండి వచ్చే ఆదేశాలే నిర్ణయిస్తున్నా యని మండిపడ్డారు. ఈ దారుణమైన పరిస్థితి మారాలంటే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాల్సిందేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు గతంలో బీఆర్ఎస్‌కు పదేళ్లు అవకాశం ఇచ్చారని, కానీ కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా ప్రజలను మోసం చేసి మజ్లిస్ పార్టీకే కొమ్ముకాశాయని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి 50 శాతం స్థానాలు అందించి మోదీ ప్రభుత్వానికి అండగా నిలిచారని, అదే నమ్మకంతో రాష్ట్రంలోనూ మార్పు కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. నగరంలో,రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'సర్' ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మజ్లిస్ పార్టీ వైఖరిని కిషన్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. సర్ వస్తుందంటే మజ్లిస్ పార్టీ ఎందుకు అంతగా భయపడుతోంది? పాతబస్తీలో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు, ఇతర అక్రమ వలసదారుల ఓట్లు ఎక్కడ తొలగిపోతాయోనని వారికి వణుకు పుడుతోందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల మీద నమ్మకం లేకపోవడం శోచనీయమన్నారు. ఈ ప్రక్రియలో పనిచేసేది కేంద్ర అధికారులు కాదు, తెలంగాణ ఉద్యోగులేనని గుర్తుచేశారు. గత 2002 లో ఇలాంటి సర్వే జరిగినప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ భాగస్వామ్యమే ఉందని, నాడు లేని భయం ఈ రోజు ఎందుకు అని నిలదీశారు. పశ్చిమ బెంగాల్‌లో ఒకప్పుడు అక్రమ వలసదారులు మనవాళ్లపై అరాచకాలు చేశారని, కానీ అక్కడ బీజేపీ పట్టు సాధించాక వారంతా తోకముడిచి బంగ్లాదేశ్ పారిపోతున్నారని వివరించారు. నగర రక్షణ కోసం 'సర్' లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, దీనిని అడ్డుకోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరిత ప్రచారాలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి హెచ్చరించారు. ఒకవేళ మీ ఓటు హైదరాబాద్‌లో ఉంటే గ్రామాల్లో రేషన్ కార్డులు, పింఛన్లు పోతాయంటూ కాంగ్రెస్ నాయకులు అమాయక ప్రజలను బెదిరిస్తున్నారు. ఓటు హక్కుకు, సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం ఉండదు. దీనివల్ల ఎవరి కార్డులు కట్ అవ్వవని ప్రజలకు భరోసా ఇచ్చారు. కార్యకర్తలంతా బీఎల్‌ఓలతో కలిసి తిరిగి ప్రజల ఓటు హక్కును కాపాడాలని సూచించారు.

# కేంద్రం సహకరిస్తేనే రాష్ట్రాలు అభివృద్ధి సాధ్యం

మొదటిపేజీ తరువాయి

వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలను కేంద్రానికి మంత్రి సీతక్క తెలియజేశారు. సోమవారం ఢిల్లీలో జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సుకు సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణాభివృద్ధి పథకాల అమలును జాతీయ సదస్సులో కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా లేక ఆ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టాలా అనే దానిపై ఆలోచన చేస్తామన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం పెడితే కేంద్రం నిధులు ఇవ్వదని..100శాతం ఆర్థిక భారం రాష్ట్రంపై పడుతోందని వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పలు కీలక సమస్యలు, నిధుల విడుదల అంశాలపై వినతిపత్రం సమర్పించారు. 'వికసిత్ గ్రామాలు-2047' అనే గొప్ప ఆశయం నెరవేరాలన్నా, గ్రామీణ ప్రాంతాలు స్వయంసమృద్ధి సాధించాలన్నా రాష్ట్రాలపై కేంద్రం అదనపు ఆర్థిక భారం మోపకూడదని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన విబిజి రామ్ పథకంలో ప్రవేశపెడుతున్న కొత్త 60:40 నిధుల విధానంపై తెలంగాణ ప్రభుత్వం తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ నూతన ఆర్థిక సమీకరణ వల్ల రాష్ట్రాలపై ఊహించని రీతిలో భారీ ఆర్థిక భారం పడుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ నిబంధనలపై జూలై 2న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ఒక తుది నిర్ణయం తీసుకోనుందని వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గతంలో ఉన్నట్లుగానే 100 శాతం వేతనాల విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. అలాగే మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి కూడా గతంలో ఉన్న 75 శాతం కేంద్ర వాటాను అలాగే ఉంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కేంద్ర నిధులు కోల్పోకుండానే, రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిస్థాయిలో కాపాడేలా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తుందని స్పష్టం చేశారు.

ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద రాష్ట్రంలో చేపట్టే గ్రామీణ రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ప్రధాన అడ్డంకిగా మారాయని మంత్రి సీతక్క కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆదిలాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్లమల అటవీ ప్రాంతాల్లో అనేక రోడ్డు పనులు పూర్తిగా నిలిచి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రోడ్లే కాకుండా, అటవీ అనుమతులు సకాలంలో రాకపోవడం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లోని పేదలకు ఇళ్లు, బోర్‌వెల్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు కూడా అర్ధాంతరంగా ఆగిపోయాయని వివరించారు. ఈ క్లియరెన్స్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, రాష్ట్రానికి రావాల్సిన పీఎం ఆవాస్ యోజన గృహాల కేటాయింపులను కేంద్రం వెంటనే విడుదల చేయాలని కోరారు. కేంద్రం నుండి నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యం వల్ల పనులు మందగిస్తున్నాయని, రాష్ట్రంలో అధికారుల తరచూ బదిలీల వల్ల కూడా కేంద్రానికి నివేదికలు సమర్పించడంలో కొంత ఆలస్యం జరిగిందని ఆమె అంగీకరించారు. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ గ్రామీణాభివృద్ధిలో తెలంగాణ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోందని మంత్రి సీతక్క గర్వంగా ప్రకటించారు. జల్ సంచార్ విభాగంలో తెలంగాణ రాష్ట్రానికి ఏకంగా 13 జాతీయ అవార్డులు రావడం తమ ప్రభుత్వ సమర్థవంతమైన పనితీరుకు నిదర్శనమన్నారు. అలాగే, దేశవ్యాప్తంగా 100 రోజుల ఉపాధి కల్పనను అమలు చేయడంలో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తేనే గ్రామాల అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని కేంద్రమంత్రికి వివరించారు. 100 రోజుల ఉపాధి కల్పనలో తెలంగాణ.. దేశంలో రెండో స్థానంలో ఉందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో పీఎం ఆవాస్ గృహాల కేటాయింపులు లేవని.. ఇప్పుడు వెంటనే ఇవ్వాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరుతోందన్నారు. తెలంగాణ నుంచి పన్నుల వాటా తీసుకుంటున్నప్పుడు కేంద్ర పథకాలు రాష్ట్రంలో అమలు చేయాలని తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు అటవీ క్లియరెన్స్‌పై వినతిపత్రం అందజేసినట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి నిధుల విడుదలలో కూడా జాప్యం జరుగుతోందన్నారు. తరచూ అధికారుల బదిలీలతో నివేదికల సమర్పణలో ఆలస్యం జరిగిందని అన్నారు.

# మూసి పునరుజ్జీవ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తుకు బలమైన పునాది

**- అభివృద్ధి,మానవీయత రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతాం**

**- భూ సేకరణ, పునరావాసంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమీక్ష**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసి పునరుజ్జీవ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధికి, హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే చారిత్రాత్మక ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మూసి నది పునరుజ్జీవంతో నగరానికి కొత్త జీవం పోసేలా, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోందన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ, పునరావాసం తదితర అంశాలపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి సోమవారం ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఎండీ ఈ.వి. నర్సింహారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మూసి నదిని పునరుజ్జీవింప జేసి, దాన్ని పర్యాటకం, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి కేంద్రంగా మార్చాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, ఇది భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, పర్యావరణహితమైన జీవన వాతావరణాన్ని అందించే సంకల్పమని వివరించారు. మూసి నది కాలుష్యంతో ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వరదల సమయంలో పరివాహక ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుందని తెలిపారు. వరద నియంత్రణ, నీటి శుద్ధి, పచ్చదనం పెంపు, రోడ్లు, పార్కులు, వాక్‌వేలు, వినోద కేంద్రాలు ఏర్పాటు ద్వారా మూసి పరివాహక ప్రాంతాలను సరికొత్త జీవన కేంద్రాలుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. గతంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్టుగా మూసి ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదని, ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని గుర్తు చేశారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో పేదల జీవితాలు దెబ్బతినకుండా ప్రతి నిర్ణయం మానవీయ కోణంలోనే తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టులో భూ సేకరణ ప్రక్రియలో ప్రజా కోణంలో ఆలోచించి మానవీయ కోణంలో నిర్ణయాలు ఉండాలని అధికారులకు సూచించారు. ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని ఇందుకు అవసరమైన క కార్యాచరణ రూపొందించి తక్షణమే అమలు చేయాలని ఆదేశించారు. భూములు కోల్పోయే వారికి చట్టబద్ధమైన పరిహారం, అవసరమైన పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం ఎటువంటి రాజీ పడబోదని మంత్రిగారు స్పష్టం చేశారు.

# కొడంగల్‌లో 33వేల డూప్లికేట్ ఓట్లు

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయని తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి 32వేల మెజారిటీతో గెలిచారని అన్నారు. ఈ డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని తమకు అనుమానం ఉందని చెప్పారు. కర్ణాటక నుంచి నోటు ట్రాన్స్‌ఫర్‌తో పాటు ఓటు ట్రాన్స్‌ఫర్ అయిందా అనే అనుమానం తమకు కలుగుతోందని కవిత పేర్కొన్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. 'సర్' దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను వెంటనే పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లకు ఏపీలో కూడా ఓటు ఉందని... ఎక్కడైనా ఒక చోటు మాత్రమే ఓటు ఉండేలా చూడాలని సూచించారు. ఇంటర్ స్టేట్ డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు. ఎన్నికల సంఘానికి ఈ విషయాలపై ఫిర్యాదు చేస్తామని కవిత పేర్కొన్నారు.

## 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల

# ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

÷SmK+÷ూ సింగిల్ విండో వ్యవస్థ ద్వారా అనుమతులు 21 రోజుల్లోనే మంజూరవుతున్నాయని, ఇప్పుడు సాంకేతికత సహాయంతో మరింత పారదర్శకత, పెండింగ్ అనుమతుల రియల్-టైమ్ ట్రాకింగ్ అందుబాటులోకి వచ్చిందని వివరించారు. 1950-70వ దశకాలలో స్థాపించిన సంస్థల ఆధారంగా అభివృద్ధి చెందిన తెలంగాణ రక్షణ, ఏరోస్పేస్ రంగం ఇప్పుడు ఐటీ, ఫార్మా ఎగుమతులను మించిపోయిందని మంత్రి ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్, రాబోయే రీజినల్ రింగ్ రోడ్, వరంగల్, ఆదిలాబాద్ లలో నిర్మిస్తున్న కొత్త విమానాశ్రయాలు వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ద్వారా జిల్లా కేంద్రాలకు హైదరాబాద్ స్థాయి కనెక్టివిటీని విస్తరించనున్నట్లు తెలిపారు. 30,000 ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నెట్-జీరో, కాలుష్య రహిత నగరంగా అభివృద్ధి చేయనున్నారు. ఇందులో 200 ఎకరాల్లో ఏఐ సిటీ, గ్రీన్ ఫార్మా యూనిట్లు, అన్ని తరగతుల వారికి నివాస ప్రాంతాలు, దేశంలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో మొదటి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఉంటాయి. వచ్చే ఐదేళ్ల కోసం రూ. 600 కోట్లు కేటాయించినట్లు, ప్రతి జిల్లాలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. భూమి కొనుగోలు చేయకుండా లీజుకు తీసుకునే విధానాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఇది కరోనా మహమ్మారి సమయంలో దెబ్బతిన్న వారికి పెట్టుబడి సమస్యలను తగ్గిస్తుందని పేర్కొన్నారు. కొత్త పార్క్ స్థలంలో నాలుగో వంతు మహిళా పారిశ్రామికవేత్తలకు కేటాయించనున్నారు. అలాగే, ఆర్థిక సహాయం పొందడంలో, సాంకేతికతను (అందుకోవడంలో ఇబ్బందులు పడుతున్న వారికి సహాయం చేసేందుకు 'ఇండస్ట్రీ హెల్త్ క్లినిక్స్'ను ప్రభుత్వం ప్రారంభించింది. తమ ప్రభుత్వం 'నియంత్రణాధికారిగా కాకుండా సహాయకారిగా' వ్యవహరిస్తుందని శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. అత్యున్నత శ్రేణి మౌలిక సదుపాయాలు, డిజిటల్ సన్నద్ధత, విధాన స్థిరత్వాలు అంతర్జాతీయ పెట్టుబడిదారుల దృష్టిలో తెలంగాణను విభిన్నంగా నిలబెడుతుందని ఆయన అన్నారు.

## ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం

మొదటిపేజీ తరువాయి

ఇది భారత్-సీషెల్స్ సముద్ర సహకారానికి ప్రతీకని పేర్కొంది. మరోవైపు, ఈ వేడుకల అనంతరం ప్రధాని మోదీ కూడా ఎక్స్‌లో స్పందించారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం' అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' లభించింది. దీనిని ఆ దేశ ప్రధాని ప్యాట్రిక్ హెర్మినీ.. భారత ప్రధానికి అందజేశారు.

## హరీష్ రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ప్రజానీకం మాకు ఐదేళ్లకు అధికారమిచ్చారు. రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తాం. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. గడచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీష్‌రావుకు తెలుసు. ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముంది? రెండుకాళ్లు లేనివాడు చూసుకుందాం రా.. అని సవాలు విసిరినట్లే బిఆర్ఎస్ నాయకుల సవాళ్లు ఉంటున్నాయన్నారు. ఈ ప్రభుత్వం చేసే మంచిపనులను జీర్ణించుకోలేక భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కేటీఆర్ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారు. నా నియోజకవర్గం పాలేరులో కేటీఆర్ విమర్శలు ఇదే కోవలోకి వస్తాయి. బిఆర్ఎస్ నాయకులు చేసే చిల్లర విమర్శలకు ప్రతిసారీ స్పందించను. ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్ర కాల్చి వాత పెడతా. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్టుకాదు. ప్రజలు ఛీ కొట్టినా బాంబులు పడ్డట్టే. ఏ వ్యక్తిమీదా వ్యక్తిగత కక్షపూరితమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. తప్పుచేసిన వాళ్ళను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదు. ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారు. తమిళనాడు లాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో తీసుకురాం.

అధికారంలోకి వస్తామని బిజేపీ పగటికలలు కంటోంది. ఆశ ఉండడంలో తప్పులేదు కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ రాని పార్టీ అధికారం గురించి ఆశ పడుతోంది. బిజేపీ, బిఆర్ఎస్ ఒకే తాను ముక్కలు. కాళేశ్వరం అవినీతి, ధర్మల్ పవర్ ఎ÷-లాంట్ అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలని అడిగితే బిజేపీ ఇప్పటివరకు స్పందించలేదు. ఈ సారి రైతు భరోసా నిధులను అనుకున్నదానికంటే రెండు మూడు రోజుల ముందే వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో జమచేస్తాం. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు 18 నియోజకవర్గాలలో 23 స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదు. భూముల ధరల సవరణలు ఎక్కడైనా పొరపాటుగా ఎక్కువ ధర నిర్ణయిస్తే సరిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. తాండూరులో ఇదే విధంగా జరిగితే సరిదిద్దడం జరిగింది. అని మంత్రి పొంగులేటి అన్నారు.

## తెలంగాణ-కొరియా మధ్య

# పర్యాటక, సాంస్కృతిక సహకారం

మొదటిపేజీ తరువాయి

భారత్‌లోని కొరియన్ కల్చరల్ సెంటర్ డైరెక్టర్, భారతదేశంలోని కొరియా రాయబార కార్యాలయం కల్చర్ అండ్ ప్రెస్ కౌన్సిలర్ హ్వాంగ్ ఇల్యాంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ గొప్ప చారిత్రక వారసత్వం, వైవిధ్యభరితమైన సంస్కృతి, సంప్రదాయ కళారూపాలు, ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ప్రతిపాదిత తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం ద్వారా ఇరు ప్రాంతాల కళలు, సంగీతం, నృత్యం, వంటకాలు, సంప్రదాయాలను ఒకే వేదికపై ఆవిష్కరించే అవకాశం లభిస్తుందని, పర్యాటకాభివృద్ధితో పాటు ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత పెరుగుతాయని తెలిపారు.

భారత్‌లో, ముఖ్యంగా యువతలో కొరియన్ కే-డ్రామాలు, కొరియన్ వినోద కార్యక్రమాలకు ఓటీటీ వేదికల ద్వారా విశేష ఆదరణ లభిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సాంస్కృతిక అనుబంధం తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించడంతో పాటు కళలు, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, సృజనాత్మక భాగస్వామ్యాలకు కొత్త అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ, సృజనాత్మక పరిశ్రమల రంగాల్లో కొరియాతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, వారసత్వ పరిరక్షణ, పర్యాటక ప్రోత్సాహం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో కిమ్ కాంగ్‌హున్ (హెడ్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్, ఐఅఅఎ), ఇమ్ హ్వాజే (హెడ్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్, ఐఅఅఎ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కొరియా కాన్సుల్ జనరల్ సురేష్ చుక్కపల్లి పాల్గొన్నారు.

# ఎల్కుర్తిలో రూ.2.05 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఘనంగా స్వాగతం పలికిన ఎలకుర్తి సర్పంచ్ నరిశెట్టి సుధాకర్, ఉప సర్పంచ్ కొలిపాక రమేష్, నేతలు
- ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం
- గుడిసెలు లేని నియోజకవర్గంగా స్టేషన్ ఘన్‌పూర్ తీర్చిదిద్దడమే లక్ష్యం
- గత పాలకులు అభివృద్ధిని విస్మరించారని విమర్శలు









**కరపత్రం ప్రతినిధి స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 29**
తెలంగాణలోనే గుడిసెలు లేని నియోజకవర్గంగా స్టేషన్ ఘన్‌పూర్‌ను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, అర్హులైన నిరుపేదలకు రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు. ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రూ.13 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించడంతో పాటు, రూ.1.92 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆర్అండ్‌బీ సీసీ రోడ్డు, సైడ్ డ్రెయిన్‌ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడిన ఎమ్మెల్యే, గత రెండు దశాబ్దాలుగా నియోజకవర్గ అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన రహదారులే ఇప్పటికీ గ్రామాలకు ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. అప్పట్లో వేసిన సింగిల్ బీటీ రోడ్లను ఇప్పుడు డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జాతీయ రహదారి నుంచి ఎల్కుర్తి మీదుగా నారాయణగిరి వరకు రూ.18 కోట్లతో డబుల్ రోడ్డు మంజూరైందని, కరుణాపురం--సోమదేవరపల్లి--ఎల్కుర్తి మార్గంలో రూ.50 కోట్లతో మరో డబుల్ రోడ్డు త్వరలోనే మంజూరు కానుందని వెల్లడించారు. ప్రస్తుతం ప్రారంభించిన రోడ్డు నిర్మాణాన్ని 60 రోజుల్లో పూర్తి చేస్తామని, గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఎల్కుర్తి గ్రామంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్న కడియం శ్రీహరి, అసంపూర్తిగా ఉన్న గ్రామపంచాయతీ భవనాన్ని పూర్తి చేసేందుకు వెంటనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఏడాది వ్యవధిలో గ్రామానికి నాలుగు వైపులా ఉన్న రహదారులను డబుల్ రోడ్లుగా మార్చి ఎల్కుర్తి రూపురేఖలు మార్చేస్తామని చెప్పారు. అదే సమయంలో గత ప్రజాప్రతినిధులపై విమర్శలు గుప్పించిన ఎమ్మెల్యే, అభివృద్ధి కంటే స్వప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని, గ్రామాల్లో ఒక్క పని చేయని వారు ఇప్పుడు విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమమే తన ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎలకుర్తి సర్పంచ్ నరిశెట్టి సుధాకర్, ఉప సర్పంచ్ కొలిపాక రమేష్, ఎలకుర్తి ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యుడు, కల్లు గీత కార్మిక సంఘం హనుమకొండ జిల్లా కార్యదర్శి మాచర్ల సదానందం గౌడ్, నర్సింగరావు పల్లె సర్పంచ్ యాద శోభారాణి-కుమారస్వామి, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, ఎలకుర్తి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మినుముల సురేష్, మండల నాయకులు, మహిళా నాయకురాళ్ళు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'రైతు భరోసా" నిధుల విడుదల

- సీఎం నిర్ణయాన్ని స్వాగతించిన నర్సింగరావుపల్లి సర్పంచ్ యాద శోభారాణి - కుమారస్వామి



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 29**
రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నేడు ఖమ్మంలోని మధిర నియోజకవర్గంలో నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసినప్పటికీ, రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో ఎలాంటి జాప్యం లేకుండా నేడు (జూన్ 30) సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక నుంచి 'రైతు భరోసా" నిధులను విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయంపై నర్సింగరావుపల్లి గ్రామ సర్పంచ్ యాద శోభారాణి-కుమారస్వామి హర్షం వ్యక్తం చేశారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు, రైతులు ఇబ్బందులు పడకుండా సభను వాయిదా వేయడంతో పాటు, రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేసే కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగించడం ప్రభుత్వ రైతు పక్షపాత వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రివర్గానికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, రైతు అనుకూల విధానాలు వ్యవసాయ రంగానికి మరింత బలం చేకూరుస్తాయని అన్నారు.

రైతు భరోసా వంటి పథకాల ద్వారా రైతులకు ఆర్థిక భద్రత కలుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తమ గ్రామాల్లోని రైతు వేదికల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యాద శోభారాణి-కుమారస్వామి పిలుపునిచ్చారు.

# నిర్దేశిత గడువులోగా ఎస్ఐఆర్ పూర్తి చేయాలి

- ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లకు కీలక ఆదేశాలు





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 29**
భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన కార్యాచరణ ప్రకారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, వివరాల నమోదు ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరించడంతో పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలతో సమన్వయం కొనసాగిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

హనుమకొండ జిల్లాలో వేగంగా ఫారాల పంపిణీ

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని వివరించారు. జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ వేగవంతంగా కొనసాగుతోందని తెలిపారు. పరకాల నియోజకవర్గంలో 69 శాతం, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 47 శాతం ఫారాలు పంపిణీ పూర్తయ్యాయని, మరో రెండు రోజుల్లో రెండు నియోజకవర్గాల్లోనూ వంద శాతం పంపిణీ పూర్తి చేస్తామని వెల్లడించారు.

ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. పంపిణీ అనంతరం బూత్ స్థాయి అధికారులకు రెండో విడత ప్రత్యేక శిక్షణ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం అన్ని బీఎల్ఓలు ఫారం-6 డిక్లరేషన్‌తో ఇంటింటికీ వెళ్లి విధులు నిర్వహిస్తున్నారని, ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డి.ఎస్. వెంకన్న, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు ఊరట.. నేడు 'రైతు భరోసా' నిధుల విడుదల

- ప్రభుత్వ నిర్ణయం-రైతుల పట్ల ఉన్న నిబద్ధతను తెలియజేస్తోంది
- ప్రభుత్వ నిర్ణయాన్ని అభినందించిన హనుమకొండ కిసాన్ సెల్ అధ్యక్షులు పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 29**
భారీ వర్షాల కారణంగా ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసినప్పటికీ, రైతులకు అందించాల్సిన పెట్టుబడి సాయాన్ని మాత్రం ఆలస్యం చేయకుండా నేడు(మంగళవారం)జూన్ 30 విడుదల చేయనున్నట్లు అని ప్రభుత్వం ప్రకటించడం పట్ల హనుమకొండ కిసాన్ సెల్ అధ్యక్షులు పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక నుంచి సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారని తెలిపారు. ప్రకృతి విపత్తుల నేపథ్యంలో సభను వాయిదా వేయడం సముచిత నిర్ణయమని, అయితే రైతుల ప్రయోజనాలకు భంగం కలగకుండా నిధుల విడుదలను యథావిధిగా కొనసాగించడం ప్రభుత్వం రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని బలోపేతం చేయడం, రైతులకు ఆర్థిక చేయూత అందించడం లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలు ప్రశంసనీయమని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రివర్గానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం లోని రైతులంతా తమ సమీప రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి కోరారు.

## కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌ను ప్రారంభానికి సిద్ధం చేయండి

- జిల్లా కలెక్టర్ కుడా వైస్ చైర్మన్ చాహత్ బాజ్‌పాయి
- అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్
- భద్రకాళి బండ్ నిర్వహణ పనులపై ప్రత్యేక దృష్టి..
- నాణ్యతలో రాజీ పడొద్దని అధికారులకు ఆదేశం





**కరపత్రం ప్రతినిధి జూన్, 29**
కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌ను అన్ని విధాలుగా ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) వైస్ చైర్మన్, చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌లో కొనసాగుతున్న పునరుద్ధరణ, సుందరీకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, సివిల్ పనులు దాదాపు పూర్తయ్యాయని, ఫౌంటెన్లు, సుందరీకరణ, ల్యాండ్‌స్కేపింగ్ తదితర తుది పనులు కూడా పూర్తి దశకు చేరుకున్నాయని వివరించారు. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి, గార్డెన్‌ను ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని కుడా వైస్ చైర్మన్ సూచించారు. అనంతరం భద్రకాళి బండ్‌లో కొనసాగుతున్న నిర్వహణ పనులను పరిశీలించిన చాహత్ బాజ్‌పాయి, పారిశుద్ధ్యం, గార్డెనింగ్, స్వీపింగ్, క్లీనింగ్ వంటి నిర్వహణ కార్యక్రమాలను నిరంతరం సమర్థవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. నిర్వహణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా నిరంతర పర్యవేక్షణతో పనులు కొనసాగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పరిశీలనలో కూడా అధికారులు, సీపీవో అజయ్ రెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


## వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఎన్. శ్వేత




**కరపత్రం ప్రతినిధి వరంగల్ జిల్లా జూన్ 29**
తెలంగాణ ప్రభుత్వం పోలీసు ఉన్నతాధికారుల బదిలీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సన్‌ప్రీత్ సింగ్‌ను బదిలీ చేశారు. ఆయనను సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగానికి నియమించారు. వరంగల్ నూతన పోలీస్ కమిషనర్‌గా 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఎన్. శ్వేతను ప్రభుత్వం నియమించింది. గతంలో సిద్దిపేట జిల్లా తొలి మహిళా ఎస్పీగా సేవలందించిన ఆమె, అనంతరం హైదరాబాద్ ఉత్తర మండలంలో డీసీపీ(లా అండ్ ఆర్డర్)గా పనిచేశారు. ప్రస్తుతం వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎన్. శ్వేత నియామకంతో చారిత్రక ఓరుగల్లు నగరంలో మహిళా నాయకత్వంలో పోలీసు వ్యవస్థకు కొత్త ఊపు రానుందని అధికారులు, ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొత్త కమిషనర్ ఆధ్వర్యంలో శాంతిభద్రతలు, నేర నియంత్రణ, ప్రజలకు మరింత చేరువయ్యే పోలీసింగ్‌కు ప్రాధాన్యం లభించే అవకాశముంది.

# ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో సమీక్ష






**కరపత్రం ప్రతినిధి వరంగల్, జూన్ 29**
భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన కార్యాచరణ ప్రకారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఎన్నికల నమోదు అధికారులు సహాయ ఎన్నికల నమోదు అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన కార్యాచరణ ప్రకారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ సేకరణ, వివరాల నమోదును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతి అర్హుడైన ఓటరును తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాలను ధ్రువీకరిస్తూ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, రాజకీయ పార్టీలతో సమన్వయం కొనసాగిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని వివరించారు. జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ వేగవంతంగా కొనసాగుతోందని తెలిపారు. జిల్లా లో మూడు నియోజక వర్గాలు ఉన్నాయని, వరంగల్ తూర్పు 48.20 శాతం, నర్సంపేట 74.46% వర్ధన్నపేట 63.9% ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్.ఐ.ఆర్ ప్రశాంతంగా జరుగుతుందని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డిఆర్ఓ విజయలక్ష్మి
వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణిలు సంబంధిత తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
మంగళవారం జూన్ 30, 2026

# రాయపర్తి చేనేత సహకార సంఘ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- జూలై 2 నుంచి నామినేషన్ల స్వీకరణ -- 10న ఎన్నికలు
- ఎన్నికల విధానంపై సభ్యులకు అవగాహన కల్పించిన ఎన్నికల అధికారి ఎస్. సందీప్ కుమార్

**కరపత్రం ప్రతినిధి నడికూడ, జూన్ 29**

నడికూడ మండలం రాయపర్తి చేనేత పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ (రిజిస్ట్రేషన్ నెం. టి టి డబ్ల్యూ-80) ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి ఎస్. సందీప్ కుమార్ సోమవారం విడుదల చేశారు. అనంతరం సంఘ సభ్యులతో సమావేశమై ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్ విధానంపై పూర్తి వివరాలు వెల్లడించారు. సంఘ పరిధిలో రాయపర్తి, నరసక్కపల్లి, పులిగిల్ల, మల్లక్కపేట గ్రామాలు ఉండగా, మొత్తం 191 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఓటరు జాబితాలో పేరున్న సభ్యులకు మాత్రమే ఓటు హక్కుతో పాటు పోటీ చేసే అర్హత ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఎన్నికలు రహస్య బ్యాలెట్ (సీక్రెట్ బ్యాలెట్) విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 9 డైరెక్టర్ పదవులు ఉండగా, అందులో మహిళలకు 2 స్థానాలు, జనరల్‌కు 7 స్థానాలు కేటాయించినట్లు వెల్లడించారు. నామినేషన్లు జూలై 2, 3, 4 తేదీల్లో స్వీకరిస్తారు. జూలై 5న స్క్రూటినీ, జూలై



6న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఒకవేళ తుది జాబితాలో 9 నామినేషన్లు మాత్రమే ఉంటే ఎన్నిక ఏకగ్రీవంగా ప్రకటిస్తారు. అంతకంటే ఎక్కువ నామినేషన్లు ఉంటే జూలై 10న ఎన్నికలు నిర్వహిస్తారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఫోటో, ఆధార్ కార్డు, అవసరమైన పత్రాలతో పాటు ఒక ప్రతిపాదకుడు (ప్రపోజర్), ఒక బలపరిచే సభ్యుడు (సెకండర్) సంతకాలతో నామినేషన్ సమర్పించాలని తెలిపారు. ప్రతిపాదకుడు, బలపరిచే సభ్యుడు ఇద్దరూ ఓటరు జాబితాలో పేరున్న సభ్యులే కావాలని సూచించారు.
నామినేషన్ ఫీజు జనరల్ అభ్యర్థులకు రూ.1,000, బీసీ అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే రూ.750, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500గా నిర్ణయించినట్లు



వెల్లడించారు. నామినేషన్ తిరస్కరణ జరిగినా ఫీజు తిరిగి చెల్లించబడదని స్పష్టం చేశారు. ఎన్నికలు జరిగితే వాటికి సంబంధించిన స్వల్ప వ్యయాన్ని సంఘమే భరించాల్సి ఉంటుందని తెలిపారు. ఒకవేళ డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవమైతే, ఎన్నికైన డైరెక్టర్లు మూడు రోజులలోపు అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి పదవులకు ప్రత్యేకంగా నామినేషన్లు దాఖలు చేసి ఆఫీస్ బేరర్లను ఎన్నుకుంటారని వివరించారు. ఈ ఎన్నికలకు ప్రత్యేక నామినేషన్ ఫారం మాత్రమే ఉంటుందని, ఎలాంటి ఫీజు ఉండదని తెలిపారు.
ఎన్నికల నోటీసు, ఓటరు జాబితాను సంఘ కార్యాలయంతో పాటు గ్రామ పంచాయతీ, తహసీల్దార్ (ఎంఆర్వో), ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రదర్శించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

# చేయూత పెన్షన్ల మంజూరులో ప్రభుత్వం కాలయాపన చేస్తోంది

- జూన్ 2 నుంచి పంపిణీ అంటూ ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదు
- పెన్షన్ల పెంపు, కొత్త మంజూరుపై హామీలు ఎక్కడ అమలయ్యాయి?
- బీకేఎంయూ నేత వెంకట్రాములు

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 29**

రాష్ట్రంలో కొత్త చేయూత పెన్షన్ల మంజూరుపై ప్రభుత్వం ప్రకటించిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు విమర్శించారు. జూన్ 2 నుంచి కొత్త పెన్షన్ల పంపిణీ ప్రారంభిస్తామని ప్రకటించినప్పటికీ, ఇప్పటికీ అమలు జరగకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.
ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వృద్ధాప్య, వితంతువు, చేనేత, గీత కార్మికుల పెన్షన్లను రూ.4 వేలకు, వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచుతామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఆ హామీలు అమలు కాకపోవడం బాధాకరమన్నారు.



నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం అందుతున్న పెన్షన్లు ఏమాత్రం సరిపోవడం లేదని, వేలాది మంది వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, చేనేత, కల్లుగీత కార్మికులు కొత్త పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నా పరిశీలన కూడా జరగలేదని విమర్శించారు.
ప్రజాపాలనలో సుమారు 20 లక్షల దరఖాస్తులు వచ్చినప్పటికీ ప్రక్రియ ముందుకు సాగడం లేదని, తాజా బడ్జెట్‌లో కేవలం రెండు లక్షల కొత్త పెన్షన్లకే నిధులు కేటాయించడం ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనుమానాలు కలిగిస్తోందన్నారు.
2023 చివరి నాటికి 43.55 లక్షల మంది పెన్షన్ పొందగా, మరణాలు, ఇతర కారణాలతో సుమారు మూడున్నర లక్షల పెన్షన్లు రద్దయ్యాయని అధికారిక సమాచారం చెబుతోందని, ఆ ఖాళీలను కూడా భర్తీ చేసే పరిస్థితి కనిపించడం లేదని పేర్కొన్నారు.
ఒకవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెబుతూ, మరోవైపు భారీ ప్రాజెక్టులకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి సిద్ధపడుతున్న ప్రభుత్వం సంక్షేమ పథకాల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వెంకట్రాములు ఆరోపించారు.
ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి అర్హులైన వారందరికీ చేయూత పెన్షన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

- ఒక్క రూపాయి లంచం ఇవ్వొద్దు
- మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్గన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 29**

పేద ప్రజల సంక్షేమం, పారదర్శక పాలనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఎవరూ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి - షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు రూ.26,03,016 విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, అలాగే 39 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) లబ్ధిదారులకు రూ.14.25 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.
అనారోగ్యంతో బాధపడుతున్న ధర్మసాగర్‌కు చెందిన భూక్య వసంతకు వైద్య చికిత్స కోసం రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేసి కుటుంబ సభ్యులకు



అందజేశారు. అదేవిధంగా ముప్పారం గ్రామంలో రెండు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి సంబంధించిన మంజూరు పత్రాలను స్థానిక సర్పంచ్‌కు అందించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు ఎంతో భరోసానిచ్చే సంక్షేమ పథకమని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న రూ.1,01,116 ఆర్థిక సహాయం పెళ్లి ఖర్చుల్లో కుటుంబాలకు గణనీయమైన ఊరటనిస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, మహిళలు, పేద వర్గాల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి సంక్షేమ పథకాల అమలులో వెనుకడుగు వేయడం లేదని అన్నారు.



కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కోసం పెళ్లి అనంతరం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, మూడు నెలల్లోపు దరఖాస్తుల పరిష్కారం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి అవినీతిని సహించబోనని స్పష్టం చేసిన కడియం శ్రీహరి, ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ సహా ఏ ప్రభుత్వ పథకం కోసం కూడా ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ ప్రయోజనాలు నేరుగా చేరేలా అధికారులు నిజాయితీగా పనిచేయాలని హెచ్చరించారు.
అంతేకాకుండా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక నిధులతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# గుడిసెలు లేని నియోజకవర్గమే లక్ష్యం

- అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- రాజకీయాలకు అతీతంగా ఎంపిక
- గ్రామాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- జానకిపురానికి మరిన్ని అభివృద్ధి పనుల హామీ
- మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్గన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 29**

తెలంగాణలోనే గుడిసెలు లేని నియోజకవర్గంగా స్టేషన్ ఘన్‌పూర్‌ను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. అందులో భాగంగా పూర్తిగా ఇల్లులేని, గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన నిరుపేదలకు రాజకీయాలకు అతీతంగా తొలి ప్రాధాన్యంతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు.
మంగళవారం ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి, జానకిపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు.
జానకిపురం గ్రామాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తామని తెలిపారు. నారాయణగిరి--జానకిపురం--రాయగూడెం



వరకు బీటీ రహదారి నిర్మాణానికి త్వరలోనే మంజూరు తీసుకొస్తామని, గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి నెల రోజుల్లో పరిపాలనా అనుమతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.
ఇప్పటికే రూ.45 లక్షలతో సీసీ రహదారుల నిర్మాణం చేపట్టామని, త్వరలో మరో రూ.25 లక్షలతో అదనపు సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనం మంజూరు చేస్తామని చెప్పారు. గతంలో ఎన్నో సంవత్సరాలు ప్రజాప్రతినిధులుగా ఉన్నవారు అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. వారు చేయని పనులన్నింటినీ తాను ఒకేసారి పూర్తి చేయాలని కోరడం సమంజసం కాదన్నారు. దశలవారీగా ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు పూర్తి చేసే దిశగా ప్రభుత్వం, తాను కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.



పదవుల్లో ఉన్న సమయంలో ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చిన వారే ఇప్పుడు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. పని చేసే వారిని, పని చేయని వారిని ఒకే గాటన కట్టొద్దని అన్నారు.
నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

# దక్షిణాఫ్రికాలో విమాన ప్రమాదం

- హనుమకొండ యువకుడు మృతి



దక్షిణాఫ్రికా లో జరిగిన విమాన ప్రమాదంలో హనుమ కొండ జిల్లా హసన్పర్తి మండలం కేంద్రానికి చెందిన యువకుడు ఆడెపు సుమంత్ మృతి చెందాడు. సీతంపేట గ్రామానికి చెందిన ఆడెపు చంద్రమోహన్ వరలక్ష్మి ప్రస్తుత్ హసన్పర్తి మండల కేంద్రంలో స్థిరపడ్డారు. వీరి చిన్న కుమారుడు ఆడెపు సుమంత్(22) దక్షిణాఫ్రికాలోని జొహన్నాస్ బర్గ్ నిరుడు పైలెట్ శిక్షణ పొందేందుకు వెళ్ళాడు. శనివారం సాయంత్రం అక్కడ శిక్షణ విమానాన్ని నడుపుతున్నపుడు జరిగిన ప్రమాదంలో సుమంత్ మరణించాడు. చిన్నప్పటి నుంచే పైలెట్ కావాలనే లక్ష్యంతో కృషి చేసిన సుమంత్, ఉన్నత శిక్షణ కోసం దక్షిణాఫ్రికాకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుమారుడి మృతదేహాన్ని వెంటనే స్వగ్రామానికి తీసుకు వచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలని, తగిన సహాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు వేడుకుంటున్నారు.

# వరంగల్‌లో బీజేపీ బూత్ అధ్యక్షుల విజయసంకల్ప సమ్మేళనం

**కరపత్రం ప్రతినిధి వరంగల్ జూన్ 29**



వరంగల్ జిల్లా బూత్ అధ్యక్షుల విజయసంకల్ప సమ్మేళనంలో భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్‌కు ఘన స్వాగతం లభించింది. కార్యక్రమానికి విచ్చేసిన ఆయనను బీజేపీ రాష్ట్ర నాయకులు,వరంగల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు శాలువాతో సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బూత్ అధ్యక్షులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం,రాబోయే ఎన్నికల్లో విజయాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. విజయసంకల్ప సమ్మేళనంలో పార్టీకి చెందిన పలువురు ప్రముఖులు,స్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పేదల ఆరోగ్య రక్షణకు సీఎం సహాయ నిధి అండ

- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి రావు చేతుల మీదుగా
- రూ.73.20 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**కరపత్రం ప్రతినిధి వరంగల్ జూన్ 29**



పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి,వారి ఆరోగ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు అన్నారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు రూ.73,20,100 విలువైన మొత్తం 119ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స ఖర్చులు భరించలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తూ అండగా నిలుస్తోందని తెలిపారు. పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం సహాయ నిధికి గతంతో పోలిస్తే అధిక నిధులు కేటాయించారని,ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి వెనుకడుగు వేయడం లేదని అన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం సీఎం సహాయ నిధి ద్వారా ఎక్కువ మంది పేదలకు అధిక మొత్తంలో ఆర్థిక సహాయం అందుతోందని ఆయన తెలిపారు. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఊరటనిస్తోందని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి వినతులు,విజ్ఞప్తులను స్వీకరించిన కొండా మురళీధర్ రావు,వారి సమస్యలను ఓర్పుగా విని సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని కొండా మురళీధర్ రావు స్పష్టం చేశారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్య శారద




**కరపత్రం ప్రతినిధి వరంగల్ జిల్లా జూన్ 29**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆరేపల్లిలో నిర్వహిస్తున్న ఇంటింటి ఎన్యూమరేషన్ సర్వేను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వోలు)చేపడుతున్న ఇంటింటి సర్వే, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ,ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి,వారి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా,పారదర్శకంగా నిర్వహించి,ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో వరంగల్ ఆర్డీవో సుమ,వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ తదితర అధికారులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.